

నేడు చైర్‌పర్సన్ ఎన్నిక

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నిక సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో జరగనుంది. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరగనుంది. ఎస్సీ మహిళకు కేటాయించిన చైర్మన్ పదవి కోసం రెండో వార్డుకు చెందిన ఆకులు మల్లేశ్వరి పోటీపడుతున్నారు. వైసిపి తరపున గెలిచిన మల్లేశ్వరి టిడిపి కొండవా కప్పుకోవడంతో సంఖ్యాబలం ఉన్న వైసిపి సభ్యులు సమావేశాలకు హాజరు కాకపోవడంతో కోరం లేక రెండుసార్లు చైర్మన్ ఎన్నిక వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే ఈసారి ఎన్నికల నిబంధన ప్రకారం ఇద్దరు సభ్యులుంటే సరిపోతుందని అధికార వర్గాలు ద్వారా తెలుస్తుంది.

గంటేడ రచనల్లో జాతీయ స్ఫూర్తి

- అభ్యుదయ భావాలతో గుండెలను హత్తుకున్న రచనలు ఎన్నో
- గాయకులు గొంతు కలుపుతూ సామ్రాజ్యవాదాన్ని అడ్డుకోవాలి
- పుస్తకావిష్కరణ సభలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ





సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు రాతలు జాతీయ స్ఫూర్తిని రగిలిస్తాయని మాజీ ఎమ్మెల్సీ, ప్రజాశక్తి మాజీ సంపాదకులు ఎంవిఎస్ శర్మ అన్నారు. అభ్యుదయ భావాలు, శాస్త్రీయత, ముందు చూపు ఉట్టిపడే విధంగా కూడా ఉంటాయని వివరించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, చంద్రికారాణి దంపతులు తమ కుమారుడు రవితేజ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తాము స్థాపించిన చీకటి ప్రచురణలు వెలుగుల కోసం అనే పబ్లిషింగ్ సంస్థ ద్వారా గౌరునాయుడు రచించిన పాటల పుస్తకాన్ని ముద్రించారు. ఈ పుస్తకాన్ని ఆదివారం స్థానిక జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు, ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావు, ప్రముఖ వైద్యులు జి.సన్యాసమ్మ, ప్రముఖ కవి అట్టాడ అప్పలనాయుడు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ దేశంలో ప్రపంచీకరణ మొదలైన కాలంలోనే గౌరునాయుడు పాడుదమా స్వేచ్ఛాగీతం అంటూ జాతీయ ఉద్యమాన్ని గుర్తుచేశారని వివరించారు. ఇప్పటికీ ఈ గీతం అవసరం పెరగడం గౌరునాయుడి దార్శనికత, ముందు చూపునకు నిదర్శనమని తెలిపారు. ఇటువంటి కవులను, వారి సాహిత్యాన్ని అణచివేయడానికి పాలకపార్టీలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. అందులో భాగంగానే గురజాడ వంటి మహాకవుల వర్ధంతులను కూడా ప్రభుత్వం విస్మరించిందన్నారు. గురజాడ రచనలను మరుగున పెట్టడం ప్రభుత్వ అవివేకమేనని, ఆయన రచనలు ఎప్పుడో ఎల్లలు దాటిపోయాయని, ఆయన దార్శనికత, వ్యక్తిత్వం దాచేస్తే దాగిపోయేవి కాదన్న సంగతి పాలకులు గుర్తించుకోవాలని హితవుపలికారు. దేశ ప్రధాని, కేంద్ర మంత్రులు కూడా ఇటీవల ఆయన రచనలు గుర్తుచేసుకున్నారని చెప్పారు.

కొలువుదీరిన సాహితీలోకం

పాడుదమా స్వేచ్ఛాగీతం పుస్తకావిష్కరణ సందర్భంగా విజయనగరం ఒక్కటే కాదు, ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని కవులు, కళాకారులు, గాయకులు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు జెడ్‌పి ప్రాంగణంలో కొలువుదీరారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు సందడిగా మారింది. ముఖ్యంగా పాడుదమా స్వేచ్ఛాగీతం అంటూ ప్రజాగాయకుడు దేవిశ్రీ అలపించిన పాట జాతీయోద్యమాన్ని గుర్తుచేస్తూ సభికుల్లో ఒకింత స్ఫూర్తిని నింపింది. గంటల గౌరునాయుడు... గానాల గౌరునాయుడు అంటూ ఆ రచయిత శక్తి సామర్థ్యాలను, మనోభావాలను తెలకపల్లి రవి చమత్కరించిన తీరు సభికులను ఆలోచింప జేసింది.

గౌరునాయుడు రాసిన 'కరెంటమ్మ కరెంటు.... ఏం కరెంటు' అంటూ జానపద కళాకారుడు జానకిరాం ఆలాపన, ఈ పాట ఒక జోల.... ఈ నేల ఉయ్యాల... అంటూ ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావు తన సంగీత మేళవింపు సభికులను రంజింపజేసింది. ఇలా ఒకటా రెండా గౌరునాయుడు గేయాలతో ప్రజా గాయకులు ఆహూతులను ఆలోచింపజేశారు. పాయల మురళీకృష్ణ, కంచరాన భుజంగరావు, కొత్తూరి శ్రీనివాస్ సారథ్యంలో సాగిన ఈ కార్యక్రమంలో అనేక మంది గౌరునాయుడికి ఆప్త వాక్యాలను అందించారు.

ఓ విద్యార్థిని కోరిక మేరకే 'స్వేచ్ఛాగీతం' : గంటేడ



ప్రస్తుతం జాతీయ స్థాయిలో ఇంత ప్రాచుర్యం పొందిన పాడుదమా స్వేచ్ఛాగీతం అనే పాట తాను ఓ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తుండగా ఓ విద్యార్థిని కోరిక మేరకు రాశానని ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు గుర్తుచేశారు. తెలుగు ఉపాధ్యాయుడిని అయినప్పటికీ, సోషల్ ఉపాధ్యాయుడు ఆ రోజు రాకపోవడంతో తాను ఆ సబ్జెక్టు బోధించాల్సి వచ్చిందని తెలిపారు. ఆ సందర్భంలో భారతి అనే విద్యార్థిని పాఠ్యాంశం బోధిస్తుండగానే పాట రూపంలో చెప్పాలని కోరిందని, పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో బస్సు కోసం నిరీక్షిస్తూ రాసి ఆ చిన్నారికి ఇచ్చేశానని చెప్పారు. అలా రాసిన పాట జాతీయోద్యమ స్ఫూర్తినిస్తుందంటే తనకు ఎంతో సంతోషం మిగిల్చిందని వివరించారు. తన పాటలన్నింటికీ ఒక పుస్తక రూపం ఇవ్వడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు.

జెడ్‌పి స్కూళ్లలో కళింగ సాహిత్యం

మజ్జి శ్రీనివాసరావు



ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ప్రతి జిల్లా పరిషత్తు స్కూల్లోనూ, గ్రంథాలయాల్లోనూ ఉత్తరాంధ్ర కవులు, రచయితలు రాసిన పుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటానని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సంగీతం, సాహిత్యం, కళలకు విజయనగరం పుట్టినిల్లువంటిదని చెప్పారు. ఆ పేరు నిలబెట్టేందుకు వీలుగా జిల్లా పరిషత్తు ప్రాంగణంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించి సంగీత, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించేం దుకు కృషి చేస్తున్నానన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రముఖుల జయంతులు, వర్ధంతుల్లో గురజాడను విస్మరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా గురజాడ పేరును ప్రముఖుల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

గిరిజన గూడేల్లోనూ గంటేడ పాటలు

డివిజి శంకరరావు

గిరిజన గూడేల్లోనూ కవి గంటేడ గౌరునాయుడు రాసిన పాటలు మారుమోగుతున్నాయని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. ఇటీవల తాను ఓ గిరిజన గూడేనికి వెళ్లినప్పుడు పాడుదమా స్వేచ్ఛాగీతం అంటూ స్వాగతం పలికారని గుర్తుచేశారు. గౌరునాయుడు రచనలు నేటితరం కవులు, కళాకారులకు ఆదర్శమన్నారు.

రాజకీయ భాగస్వామ్యంతోనే సాహిత్య వికాసం : అట్టాడ



సాహితీరంగ లక్ష్యం నెరవేరాలంటే రాజకీయ నాయకుల భాగస్వామ్యం అత్యంత కీలకమని ప్రముఖ కవి అట్టాడ అప్పనాయుడు అన్నారు. అందుకు రాజకీయ నాయకులు కూడా కలిసి రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అద్భుతమైన సాహిత్యం అందించినప్పటికీ అది ప్రజల్లోకి వెళ్లాలంటే ముద్రించేవారు, దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేవారి అవసరం ఉందన్నారు. అందుకనుగుణంగా సాహితీకారులు, సాహితీప్రియులు, రచయితలు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛాగీతం పేరిట గౌరునాయుడు రాసిన సుమారు 203 పాటలను చీకటి దివాకర్ ముద్రించడం అభినందనీయమన్నారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చొరవతో ఇటీవల వెలువడిన కళింగ కథా నేల పుస్తకాలు ప్రజల్లోకి వెళ్తున్నాయని అన్నారు.

సాహిత్యంతోనే వికాసం


డాక్టర్ సన్యాసమ్మ

సంగీతం, సాహిత్యం వంటి కళల ద్వారానే మానవాళి వికాసం సాధ్యమౌతుందని ప్రముఖ వైద్యులు సన్యాసమ్మ అన్నారు. మారిన జీవన శైలిలో పుస్తక పఠనం లేదా సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించుకోవచ్చన్నారు. గౌరునాయుడు రచనలు దేశభక్తిని, పోరాట స్ఫూర్తిని నింపుతున్నాయని ఆమె కొనియాడారు.

జిల్లాకు కొత్తగా 1,521 వితంతు పింఛన్లు

1న కొత్త పింఛన్లు పంపిణీ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం



జిల్లాలో కొత్తగా 1,521 మంది వితంతువులకు జీవిత భాగస్వామి పింఛన్లు (స్పౌజ్ పింఛన్లు) మంజూరైనట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య కాలంలో వితంతువులైన వారికి జీవిత భాగస్వామి పింఛన్లను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం జిఒను విడుదల చేసిందని ఆదివారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జిల్లా అధికారులకు తెలిపారు. మంజూరైన కొత్త పింఛన్లను రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా మే 1న పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పేదల సేవలో భాగంగా జిల్లాలో 1,39,752 మందికి రూ.59.72 కోట్లు ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. వీటికి అదనంగా 1,521 మంది వితంతువులకు పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. కావున మొత్తం పింఛన్లకు సరిపడా నిధులను ముందుగానే సిద్ధం చేసుకొని, మే 1న ఉదయం 10గంటల్లోగా శత శాతం పింఛన్లు పంపిణీ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేల్చి చెప్పారు.

మండలాల వారీగా మంజూరైన కొత్త పింఛన్లు

బలిజిపేట మండలంలో 69 మందికి, భామినిలో 86, గరుగుబిల్లిలో 77, గుమ్మలక్ష్మీపురం 63, కొమరాడలో 66, జియ్యమ్మవలసలో 122, కురుపాంలో 51, మక్కువలో 131, పాచిపెంటలో 88, పాలకొండలో 77, పాలకొండ(అర్బన్)లో 47, పార్వతీపురం 126, పార్వతీపురం (అర్బన్)లో 60, సాలూరులో 75, సాలూరు (అర్బన్)లో 70, సీతంపేటలో 69, సీతానగరంలో 117, వీరఘట్టంలో 127మందికి కొత్త పింఛన్లు మంజూరైనట్లు కలెక్టర్ వివరించారు. ఈ టెలీ సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడీఓలు, తహశీల్దార్లు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగునాయుడు

మేడేను జయప్రదం చేయండి

సదస్సులో వక్తల పిలుపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రపంచ కార్మిక దినమైన మేడేను, మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, కార్యదర్శి బివి రమణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎం.ఉమా మహేశ్వరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులతో నిర్వహించిన సమ్మె సన్నాహక సదస్సులో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక, రైతు సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమ్మెను జయప్రదం చేసేందుకు కార్మిక వర్గం, కష్టజీవులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభించి కార్మికులను, కష్టజీవులను, రైతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత వంటి హక్కుల సాధనకు అవకాశం కల్పించే చట్టాలను కూడా రద్దు చేసి లేబర్ కోడ్‌ల రూపంలో కొత్త విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు కూడా ఇక అవకాశం ఉండదని, కావున రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకొనేందుకు ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అలాగే రైతుల పండించే పంటలకు మద్దతు ధర కూడా లేకుండా చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఉపాధి అవకాశాలు రోజురోజుకు తగ్గిపోతున్నాయని ప్రజలకు కొంత ఉపశమనంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని కూడా నీరు గార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఈ సమస్యలన్నింటిపై ప్రజల్లో అవగాహన పెంచి భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అందులో భాగంగానే మే 20న దేశవ్యాప్త కార్మిక కర్షక సమ్మె నిర్వహిస్తున్నామని, ఈ సమ్మెను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.సరళకుమారి, జి.జ్యోతిలక్ష్మి, పి.సరోజ, సత్యవతి, గౌరమ్మ, శ్రామిక మహిళ సంఘం నాయకులు బి.లక్ష్మి, మధ్యాహ్న భోజన నిర్వాకుల సంఘం నాయకులు వై.శాంతకుమారి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆర్ రాము, గవర వెంకటరమణ, బంకురు సూరిబాబు, పలువురు కార్మికులు, అసంఘటిత కార్మికులు, స్కీం వర్కర్లు పాల్గొన్నారు.

ఇక అందుబాటులోకి గిరిజన విద్య!

గిరిజన విద్యార్థులకు మళ్లీ మంచి రోజులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎన్నో ఏళ్లగా స్థానికంగా విద్యకు దూరమైన గిరిజన విద్యార్థులకు మళ్లీ మంచి రోజులు రాబోతున్నాయి. చదువు కోసం దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్న చిన్నారుల కష్టాలు తీరబోతున్నాయి. ˆతంలో మూతపడిన ఎయిడెడ్ పాఠశాలల స్థానంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసి తద్వారా ఉపాధ్యాయులను నియమించి స్థానికంగా విద్యాబోధన అందించేందుకు యజూఓఎతీ ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి మండలంలోని దుమ్మంగి, బొద్దిడి, పి.ఆమిటి గ్రామాల్లో మూతపడ్డ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించి పాఠశాలల పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోంది. పై ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందడంతో ఆ స్థానంలో వేరే వారిని నియమించకపోవడంతో పాఠశాలలు మూతపడ్డాయి. గత కొన్నేళ్లగా గ్రామాల్లో విద్యార్థులకు చదువు అందుబాటులో లేకపోవడంతో ప్రతిరోజు ఆటోలను, బస్సులను ఆశ్రయించి బయట ప్రాంతాలకు వెళ్లి చదువుతున్నారు. బొద్దిడి గ్రామ చిన్నారులు కాలినడకన ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదఖర్జ పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. విద్యార్థులు ఎండకు, వానకు పడుతున్న కష్టాలను చూసి తల్లిదండ్రులు గ్రామాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఆందోళనలు చేపట్టారు. అంతేకాక పలుమార్లు అధికారులకు వినతుల ద్వారా విన్నవించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దృష్టికి పాఠశాలల సమస్యను తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే చొరవ చూపి సమస్యను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామాల్లో పాఠశాలలు తిరిగి పునప్రారంభించాలని కోరారు. స్థానికంగా పాఠశాలలు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని, డ్రా పౌట్స్ తగ్గడానికి వీలుంటుందని తల్లిదండ్రులు, అధికారులు భావిస్తున్నారు.

తోటపల్లి కాలువ సమస్యపై

6న సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పాలకొండ



రైతు సంఘు నాయకులతో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

తోటపల్లి కాలువ సమస్య పరిష్కారానికై మే 6న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. కృష్ణమూర్తి విలంవ్నిచ్చారం. ఆదివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వెనుక భాగంలో గల ఆంజనేయ గుడి ఆవరణలో జరిగిన రైతు సమావేశంలో ఆయన మాట్లాడారు. తోటపల్లి ప్రాజెక్టు లక్షా80 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాల్సి ఉండగా, 80వేల ఎకరాలకు కూడా సాగునీరు అందడం లేదన్నారు. పాలకొండ మండలంలో 8వ బ్రాంచ్ పరిధిలో సుమారు 20 గ్రామాల ఆయకట్ట రైతులకు కొన్నేళ్ల నుంచి సాగునీరందడం లేదన్నారు. ఈ సమస్యపై అనేక సందర్భాలలో రైతులు అధికారులకు, పాలకులకు విన్నవించుకున్నప్పటికీ నేటికీ పరిష్కారం కాలేదన్నారు. డిసెంబర్ నుంచి పనులు ప్రారంభించి ఇప్పటికే పూర్తి చేస్తే జూన్ నాటికి సాగునీరందించొచ్చని అన్నారు. ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదని, తోటపల్లి ప్రాజెక్టు పూర్తవ్వాలంటే రూ.590 కోట్లు అవసరమని, ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసినప్పటికీ, ప్రభుత్వం రూ.47 కోట్లు మాత్రమే బడ్జెట్లో కేటాయించిందన్నారు. నిధులు కేవలం ఉద్యోగుల నిర్వహణకు మాత్రమే సరిపోతాయని, కావున తోటపల్లి కాలువ పనులు ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. రైతాంగం సహనం కోల్పోయిందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మే 6లోపు ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు నిర్దిష్ట ప్రతిపాదనలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు మాట్లాడుతూ తోటపల్లి కాలువ సమస్య పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఇందులో భాగంగా మే 6న ఉదయం 10 గంటలకు పాలకొండ దుర్గగుడి సెంటర్‌కు రైతులంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఇద్దుబోయిన సింహాద్రి, కరణం అప్పారావు, బోనుమంతుల సోమశేఖర్, గంగుల శ్రీనివాసరావు, వెన్నపు చిన్ననారాయణరావు, మజ్జి చంటిబాబు, శాసపు మన్మధరావు, శాసపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో పనిముట్లు ఏవీ?

- కూలీలపై అదనపు భారం
- కనీస వసతులు కరువు



ఎండలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఉపాధి హామీ పనులు చేసే వేతనదారులకు పనిముట్లు లేకపోవడంతో కూలీలపై అదనపు భారం పడుతుంది. ఐదేళ్ల కిందటి వరకు ఉపాధి హామీకి సంబంధించిన పనిముట్లను ప్రభుత్వమే అందించేది. కానీ గత కొన్నేళ్ల క్రితం కేంద్రం ప్రభుత్వం ఎన్ఒసి అనే సాఫ్ట్వేర్ తీసుకొచ్చినప్పటి నుండి ఈ ఉపాధిహామీకి సంబంధించిన పనిముట్లను పూర్తిగా ఇవ్వడం మర్చిపోయారు. దీంతో ఎవరికి వారే సొంతంగా పనిముట్లను కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీని నిమిత్తం రూ.200 నుంచి రూ.300 వరకు అదనపు భారము పడుతుందని ఉపాధి కూలీలు వాపోతున్నారు. ఉపాధి హామీ నిబంధనల చట్టం ప్రకారం కూలీలకు 60శాతం పనిముట్లు, 40 శాతం పాలనా ఖర్చుల కింద ఆరు శాతం మించకుండా చూసుకోవాలి. పరిపాలనకు వెచ్చించే నిధులు కింద ఉపాధి హామీ పనిముట్లు కొనుగోలు చేసే వెసులుబాటు ఉంది. గత నాలుగేళ్ల నుంచి గ్రామీణాభివృద్ధి శాఖ పనిముట్లు కొనుగోలు చేసే వెసులుబాటును కల్పించకపోవడంతో ఉపాధి హామీ సామగ్రిని కొనుగోలు చేసే అవకాశం లేకుండాపోయింది. గతంలో ఉపాధి కూలీలకు పలుగు, పార, తట్ట, నీడ కోసం టెంట్లు, తాగడానికి మంచినీళ్లు, మజ్జిగ, ప్రథమ చికిత్స కిట్లు సరఫరా చేసేవారు. కొంతకాలానికి తాగునీటికి ఐదు రూపాయిలు, తట్టకు మూడు రూపాయిలు, గుణపానికి ఐదు రూపాయిలు చెల్లెంచేవారు. మేస్త్రీకి 10 మంది కూలీలను తీసుకోచ్చేందుకు రూ.30, కూలీలు పని ప్రదేశం ఐదు కిలోమీటర్లు దాటితే 20 శాతం అదనం వేతనాన్ని చెల్లెంచేవారు. ఫిబ్రవరి నుండి మే వరకు వేసవి అలవెన్స్ కింద 60 శాతం అదనం అలవెన్స్‌ను ఇచ్చే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకపోవడంతో ఇవన్నీ వేతనదారుల చట్టం కల్పించిన హక్కులను పొందులేక అదనపు భారంతో, పనిచేసిన సమయానికి వేతనం అందకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో అక్కడక్కడ కొన్ని గ్రూపులకు వేసవి నిమిత్తం టెంట్లు ఇచ్చినా అవి అందరికీ సరిపోకపోవడంతో క్షేత్ర సహాయకులను అడిగితే ఎవరికి వారు కమ్మలతో పనిచేసే ప్రదేశంలో పందిర్లు వేసుకోమని చెబుతున్నారని ఉపాధి కూలీలు చెబుతున్నారు. ఉపాధి పనులు వేసవిలో జరగడంతో చాలామంది ఈ ఎండ వేడికి సొమ్మసిల్లిన పరిస్థితులు చాలా ఎక్కువ. ఈ పనులు ఎక్కడో గ్రామానికి ఐదు నుంచి 8 కిలోమీటర్ల దూరంలో జరగడంతో వారికి అక్కడ ఏదైనా ప్రమాదం జరిగితే కనీసం ప్రాథమిక చికిత్స కోసం కిట్లు అవసరాలకు సంబంధించిన మందులు కూడా అందుబాటు లేకపోవడంతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారు.

సాలూరు మండలం సుమారు 17,500మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. వీరందరికీ పనులు కల్పించాలని ఉన్నతాధికారులు క్షేత్ర సహాయకులకు ఆదేశాలు అందజేస్తున్నా వీరంతా వారు చెప్పేలా పనులకు వెళ్తున్నా కనీసం వీరికి ప్రాథమిక అవసరాలైన మంచినీరు, టెంట్లు కూడా లేవు. ఉపాధి హామీలో సామగ్రి విభాగం కింద పనిముట్లు కొనుగోలు చేయాల్సి ఉన్నా ప్రభుత్వాలు ఈ నిధులతో సిసి రోడ్లు, కాలువలు, బిటి రోడ్లకు మళ్లిస్తున్నట్లు అధికారులే చెబుతున్నారు. దీంతో ఉపాధి హామీ పనికి వెళ్లే కూలీలకు మాత్రం పనిముట్లు కోసం ఎవరికి వారే సొంతంగా కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీని వల్ల అదనపు భారం పడుతుందని వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనిముట్లు అందజేయాలి

గతంలో ఉపాధి హామీ పనులకు వెళ్తే కూలీలకు పార, గుణపాలు అందజేసే వారు. తట్టలను కూడా కొనుగోలు చేసి ఇచ్చేవారు. కానీ ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకపోవడంతో మాలాంటి పేదవారు ఈ కూలి డబ్బుల్లో సగం డబ్బులు ఆ పనిముట్లకే వెచ్చించాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి మాకు ఆ పనిముట్లు అందజేస్తే కూలి డబ్బులు మా జీవనానికి సరిపెట్టుకుంటాం.

గెమ్మెల సుశీల, సునీత,
ఉపాధి వేతనదారులు, దండిగాం

ఎండల్లో పనిచేయడంతో అనారోగ్యం బారినపడ్డాం

మాది గిరిశిఖర గ్రామం కొదమ. మా గ్రామం నుంచి ఉపాధి పనులకు వెళ్లాలంటే కనీసం మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి అక్కడ ఎండల్లో పనిచేయాల్సి వస్తుంది. రెండు పూటలా పనులకు వెళ్లీ రావడంతో అనారోగ్యాలతో బాధపడుతున్నారు. కుటుంబ పోషణ కోసం ఈ పనులకు వెళు‌తున్నాను. వేసవిలో ఎటువంటి పనుల్లేకపోవడంతో ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాం. అక్కడ కనీసం తాగడానికి నీళ్లు, సేదతీరడానికి టెంట్లు అయినా ఏర్పాట్లు చేయలేదు. ఏమైనా అనారోగ్యం పాలైతే వైద్యం కోసం ఇరవై కిలోమీట్లరు దూరంలో ఉండే తోణాం రావాల్సి వస్తుంది. ఇప్పటి వరకు 120 రోజుల నుంచి పనిచేస్తున్నా వేతనం అందకపోవడంతో పూట గడపడానికి కూడా చాలా కష్టంగా ఉంది. దయచేసి ప్రభుత్వం స్పందించి ఉపాధిహామీ చట్టం ప్రకారం పనిముట్లు అందించి వేతనాలను కూడా సక్రమంగా ఇవ్వాలని కోరుకుంటున్నాను.

మెల్లిక మలే,
ఉపాధివేతనదారు, కొదమ.

ప్రజాశక్తి
www.prajasakti.com



కురుపాంలో నిరసన తెలుపుతున్న పాత్రికేయులు

పర్యాటకులపై ఉగ్రదాడి దారుణం

ప్రజాశక్తి - కురుపాం

జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 28 మందిని పొట్టన పెట్టుకున్నారని, ఈ దాడులు అత్యంత దారుణమని కురుపాం ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు నెల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం కురుపాంలో గల రావాడ జంక్షన్ నుంచి బస్టాండ్ వరకు కొవ్వొత్తులు వెలిగించి శాంతియుత ర్యాలీ చేపట్టి జర్నలిస్టులు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ఈ చర్యలను ఖండించి దేశ ప్రజలంతా ఒక తాటిపైకి వచ్చి ఉగ్రవాదం ఎదుర్కోవాలని కోరారు. కార్యక్రమంలో పాత్రికేయులు జి.వెంకటరావు, కె.మౌళి, ప్రసాద్, ఎస్ శ్రీను, జి.డిల్లీశ్వరరావు, పి.సురేష్, డి.ప్రదీప్, ఎం.పృథ్వీ, సంతు, శేషు, బి.అనిల్, బి.స్వాతి, శబరిస్, మణి, మనోజ్, కూటమి నాయకులు కోలా రంజిత్ కుమార్, చంటి, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : జమ్మూ- కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులకు నిరసనగా వీరఘట్టం పట్టణ ప్రజలు ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల అంతం కావాలి, ఉగ్రవాదులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎం.పైడిరాజు, భోగి మాణిక్యచంద్రశేఖర్, జాలుమూరు అమర్నాథ్, సంబాన శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైటిసిలో పాడైన పైకప్పు రేకులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



పాడైపోయిన వైటిసి పైకప్పు

స్థానిక వైటిసి ఆవరణంలో ఏర్పాటు చేసిన రక్షణ రేకులు ఈదురు గాలులకు పూర్తిగా పాడయ్యాయి. వైటిసికి వచ్చే యువత, గర్భిణీలు, అధికారులు ఆరుబయట కాసేపు కూర్చొని విశ్రాంతి తీసుకునేందుకు ముందు భాగంలో రేకుల షెడ్ నిర్మించారు. గత నాలుగేళ్లుగా పై కప్పు రేకులు పాడైనా వాటిని మరమ్మతులు చేపట్టే ఆలోచన అధికారులు చేయలేదు. ఆరు బయట కూర్చున్న వారు వర్షానికి, ఎండకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరుబయట కూర్చొని తలపైకెత్తి చూస్తే ఆకాశం కనిపించేలా పాడైన రేకులు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైన రేకుల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి - సాలూరురూరల్

స్థానిక మున్సిపల్ కౌన్సిల్ మందిరంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం జరుగుతుందని కమిషనర్ డిటివి కృష్ణారావు తెలిపారు. ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది అందరూ పాల్గొనాలని కోరారు.

మండలానికి చేరుకున్న నోట్ పుస్తకాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ చేసినందుకు ఆదివారం మండలానికి నోటు పుస్తకాలు చేరుకున్నాయి. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సుమారు 22 వేల 492 నోట్ పుస్తకాలు వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. వీటిని వీరఘట్టం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మండల్ లెవెల్ స్టాక్ పాయింట్లు భద్రం చేసినట్లు అధికారులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1988-91లో చదువుకున్న స్నేహితులంతా ఆదివారం స్థానిక అయ్యప్ప శంకర్ కల్యాణ మండపంలో కలిశారు. వారంతా చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. వారంతా కలిసి బాధ్యతాయుతమైన ఉద్యోగులుగా, తల్లిదండ్రులుగా నైతిక విలువలతో అంతా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో స్నేహితులకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు కొట్టిస రాజశేఖర్, బి.శివశంకర్ ప్రసాద్, జి.అప్పలనాయుడు, ఐ.ఆదినారాయణ, లలిత, శాంతి, కె.పొలినాయుడు, బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో1996-2000లో చదువుకున్న స్నేహితులంతా తిరిగి ఆదివారం జోగింపేట రిసార్ట్లో కలిశారు. ఈ సందర్భంగా వారు చదువుకున్న రోజుల్లోని స్మృతులను గుర్తు చేసుకున్నారు. వారంతా కలిసి బాధ్యతాయుతమైన ఉద్యోగులుగా, తల్లిదండ్రులుగా నైతిక విలువలతో అందరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో స్నేహితులకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు అనిల్, సంతోష్, సత్యం, సాగర్., ప్రసాద్, రాజేష్, రాధిక, త్రివేణి, సంధ్య, ప్రశాంతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిబిరాలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి సెలవులు సందర్భంగా పిల్లలకు సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ప్రత్యేకంగా వేసవి విజ్ఞాన శిబిరం ఈనెల 28 నుంచి నుండి జూన్ 6 వరకు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి శాఖా గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్ర లేఖనం, మట్టితో బొమ్మలు చేయటం, పేపర్ క్రాఫ్ట్, ఆటలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు తమ ప్రతిభను వెలికి తీసుకునే అవకాశం ఈ శిబిరం ద్వారా లభిస్తుందన్నారు పిల్లలకు ఇస్తున్న ఈ సుదీర్ఘ వేసవి విరామాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్స్యకారుల దశ మారింది : భూదేవి

ప్రజాశక్తి - సీతంపేట



ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో రూ.20వేలు చొప్పున 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చకూర్చిందని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పడాల భూదేవి అన్నారు. మత్స్యకారుల సేవా పథకాన్ని ప్రారంభించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మత్స్యకారుల కళ్లల్లో వెలుగు నింపారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయం రెట్టింపు చేసి విడుదల చేసిందన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమం టిడిపి ధ్యేయమని చెప్పారు. సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10వేలు నుంచి రూ.20వేలకు పెంచి వారిని ఆర్థికంగా ఆదుకుందని అన్నారు.

అంతంత మాత్రంగానే అటవీ ఉత్పత్తుల కొనుగోలు

తీవ్ర నిరాశలో గిరిజనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎంతో కాయ కష్టంతో శ్రమించి గిరిజనులు పండిస్తున్న అటవీ ఉత్పత్తులను అధికారులు అంతంత మాత్రంగానే కొనుగోలు చేపడుతున్నారు. మరోవైపు పండించే పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారు. జీడిపిక్క బతుకు పక్క అన్న నినాదంతో గిరిజనులు పండిస్తున్న పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం లేక మద్దతు ధర రాక తీవ్ర నిరాశతో ఉన్నారు. తరతరాలు నుంచి అడవినే నమ్ముకొని గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. గిరిజన అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన జిసిసి వ్యాపార సంస్థగా మారిపోయింది. పెట్రోల్, గ్యాస్ అమ్మకాలపైనే ఎక్కువ దృష్టి పెడతుంది. గిరిజనులు పండించే అన్ని రకాల అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాల్సి ఉండగా నామమాత్రంగానే కొనుగోలు చేస్తూ చేతులు దులుపుకుంటుంది. ఇక్కడ కోల్డ్ స్టోరేజీల్లేవని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలో వేలాది ఎకరాల్లో జీడి, మామిడి తోటలు ఉన్నాయి. పదివేల టన్నులకు పైగా జీడి దిగుబడి వస్తున్నా కొనుగోలు నామమాత్రమే. ప్రైవేటు వర్తకులు గిరిజనుల వద్ద నుంచి అతి తక్కువ ధరకే వేలాది ఎకరాల జీడి పంటను కొనుగోలు చేసి లారీల్లో దూరప్రాంతాలకు తరలిస్తున్నారు. గత కొనేళ్లుగా జీడి పిక్కల వ్యాపారం ఏజెన్సీలో మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. ఈ ఏడాది మాత్రం పంట చివరి దశలో ఐకెపి ద్వారా జీడి కొనుగోలు కేంద్రం



కొనుగోలుకు సిద్ధంగా ఉన్న జీడిపిక్కలు

ఇరిడిలో ఏర్పాటు చేశారు. అధికారులు ముందస్తుగా జిసిసి ద్వారా జీడి పిక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఇటు గిరిజనుల పంటకు గిట్టుబాటు ధర, అటు ప్రభుత్వానికి మంచి ఆదాయం వచ్చేదని గిరిజన నాయకులు అంటున్నారు. ఉపాధి లేక పంటలకు గిట్టుబాటు ధర రాకపోవడంతో శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదని చెబుతున్నారు. కేజీ జీడి ధర రూ.200కు ప్రకటించి కొనుగోలు చేసి గిరిజనులకు ఆర్థికంగా అసరాగా ఉండాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు మండంగి రమణ కోరారు.

నిలకడలేని తనానికి ఆర్ఆర్ఆర్ మాటలే నిదర్శనం : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఉండి ఎమ్మెల్యే, అసెంబ్లీ ఉపసభాపతి రఘురామకృష్ణ రాజు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై వ్యక్తిగత దూషణలకు దిగడం అతని రాజకీయ నిలకడ లేనితనాన్ని తెలిజేస్తుందని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ప్రజా సమస్యలపై పోరాడే వారి పట్ల ఉపసభాపతి వ్యాఖ్యలను ప్రజాతంత్ర వాదులంతా ఖండించాలని కోరింది. పట్టణంలో విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు మాట్లాడారు. రాష్ట్రంలోని పేదల నివాసాలను ఎక్కడ కూల్చినా సిపిఎం వారికి అండగా ఉంటుందని, ఉండి నియోజకవర్గంలో కూడా అదే చేశామని తెలిపారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పేదలకు సమస్యలు లేకుండా చేయాలని సవాల్ విసిరారు. సమస్యలు పరిష్కరించకుండా, పేదలకు అండగా ఉండాల్సింది పోయి, పేదలకు అండగా ఉన్న కమ్యూనిస్టు నాయకులపై చిందులు వేయడమేమిటని ప్రశ్నించారు. వాస్తవాలను శ్రీనివాసరావు బయట పెడితే రఘురామకృష్ణ రాజుకు ఉలుకెందుకని తెలిపారు. అధికారం వచ్చాక హుందాగా ఉండాలని, అధికారం శాశ్వతంగా ఉండిపోదని, అతని ప్రవర్తనను ప్రజలందరూ గమనిస్తున్నారని విమర్శించారు. శ్రీనివాసరావుపై_రఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కు తీసుకోవాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధపడతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బుజ్జి, తనూజు, రాముడు పాల్గొన్నారు.

మలేరియాపై రేపు అవగాహన

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో మలేరియాపై అవగాహనను పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మలేరియాపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

గిరిజన కళాకారులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం



గిరిజన కళాకారుడు నాగేశ్వరరావు

గిరిజన కళాకారులకు ప్రభుత్వం భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని మండలంలో గల మామిడిమానుగూడకు చెందిన కళాకారుడు బిడ్డక నాగేశ్వరరావు కోరారు. ఆదివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో పుట్టి పెరిగి గిరిజన సాంప్రదాయాలు, కలలు, సంస్కృతి కార్యక్రమాలకు ఉట్టిపడేలా కళలు ఎన్నో జిల్లాల్లో, రాష్ట్రాల్లో, ఉన్నతాధికారులు ఉన్న వేదికల్లో గిరిజన కళలు డప్పు వాయిద్యాలతో వేశామని అలాంటి కార్యక్రమాలకు మమ్మల్ని ఐటిడిఎ ద్వారా అధికారులు రానుపోను చార్జీలు ఇచ్చి భోజనాలు పెట్టి తీసుకువెళ్లేవారని తెలిపారు. తాము వేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు ఉన్నతాధికారుల ప్రశంసలు ఇచ్చి అభినందనలు తెలియజేసేవారని, కానీ తమ బతుకులు ఆర్థిక భారంతో చితికిపోతూ భరోసా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమలాంటి పేద గిరిజన కళాకారులకు ఐటిడిఎ ద్వారా మా కుటుంబాలను పోషించి నెట్టుకొచ్చేందుకు ఉపయోగపడేలా రుణాలు సబ్సిడీ రూపంలో ఇచ్చి ఆదుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు.

అనుమానాస్పదంగా గిరిజనుడు మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

అనుమానాస్పదంగా గిరిజనుడు మృతి చెందిన సంఘటన మండలంలోని తంగలం పంచాయతీ పూలగూడ సమీపాన శుక్రవారం రాత్రి జరిగింది. పూలగూడకు చెందిన పోయి అప్పలస్వామి (55) మృతి చెందాడు. మృతుని భార్య అప్పలమ్మ స్థానిక పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. పోయి అప్పలస్వామి తంగలంలో జరిగే వివాహానికి వెళ్ళాడు. తంగలం పక్క గ్రామమైన పనసలపాడుకు చెందిన పోయి రాజు అనే వ్యక్తితో అప్పలస్వామికి మధ్య గొడవ జరిగినట్లు భార్య ఫిర్యాదులో పేర్కొంది. గొడవ జరిగిన సమయంలో అక్కడ ఉన్న గ్రామ పెద్దలు ఇద్దరికీ సర్ది చెప్పి గొడవను సర్దుమణి చేశారు. అయితే అప్పలస్వామి ఇంటికి రాకపోవడంతో భార్య తంగలం వెళ్లేందుకు బయలుదేరింది. మార్గమధ్యలో అప్పలస్వామి గాయాలతో కిందపడి మృతి చెంది ఉన్నాడు. ఈ విషయమై తంగలం గ్రామ పెద్దలకు ముందుగా తెలియజేసి పాచిపెంట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు స్థానిక ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి శవ పంచినామా చేసి పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సిహెచ్సికి తరలించారు.

అప్పలస్వామి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
గిరిజన సంఘాలు డిమాండ్

పాచిపెంట : పాచిపెంట మండలం తంగలం పంచాయతీ పూలగూడకు పోయి అప్పలస్వామి ఈనెల 25న హత్యకు గురయ్యాడని, అతని కుటుంబానికి న్యాయం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హత్యకు గురైన అప్పలస్వామి కుటుంబాన్ని మార్చురీ వద్ద గిరిజన సంఘం నాయకులు, మాజీ సర్పంచ్‌లు గెమ్మెల అప్పలరాజు, సార రాజు, వార్డు మెంబర్ పోయి అప్పన్న, ప్రజా సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఎన్‌వైనాయుడు (ఇన్‌సెట్‌లో మృతుడు అప్పలస్వామి)

నాయకులు కోటపర్తి శ్రీరాములు, పోయి రామ్మూర్తి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు పరామర్శించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సోదరుభావంతో మెలగాల్సిన ప్రజలు ఇలా హత్యకు గురికావడం భయాందోళన కలిగిస్తుందన్నారు. కుటుంబ సభ్యులు, పెద్దల సమాచారం ప్రకారం అనుమానితులుగా ఉన్న వారిని వెంటనే అరెస్టు చేసి విచారించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే మంత్రి, కలెక్టర్, ఎస్‌పి, సిఐ స్పందించి వెంటనే బాధితులకు అండగా నిలిచేందుకు చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఇటీవల మండలంలో హత్యలు జరుగుతున్నాయని, గ్రామాల్లో వాతావరణం తగ్గించేందుకు ప్రజలతో మమేకమై పోలీసులు ఇలాంటి ఘటనలు లేదా ఘర్షణ వాతావరణం ఉన్న గ్రామాలపై నిఘా పెట్టి ఈ తరహా ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

మూసే దానికి ముస్తాబు..!

ప్రజాశక్తి - వీరఘట్టం



సాంఘిక సంక్షేమ వసతి గృహానికి రంగు వేస్తున్న సిబ్బంది

స్థానిక ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం మూసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ లక్షలాది రూపాయలు వెచ్చించి ముస్తాబు చేస్తున్నారు. 2024- 25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు 16 మంది విద్యార్థులు విద్యను కొనసాగించారు. షెడ్యూలు కులాలకు సంబంధించి ఈ వసతి గృహం ఏర్పాటు చేసినప్పటికీ సాంఘిక సంక్షేమ వసతి గృహాల అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు పెద్దగా ప్రవేశం లేకపోవడంతో 16 మంది పిల్లలు కూడా ఆయా వర్గాలకు చెందిన వారే వసతి గృహంలో చేరి విద్యను కొనసాగించారు. పదో తరగతి చదివిన అయిదుగురు విద్యార్థులు పరీక్షల అనంతరం వెళ్లిపోవడంతో ప్రస్తుతం 11 మంది పిల్లలు మాత్రమే విద్యను కొనసాగించారు. విద్యార్థులందరికీ ప్రభుత్వ పాఠశాలలో సీటు లభించకపోవడంతో ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యను కొనసాగించారు. ప్రైవేట్ పాఠశాలలో మధ్యాహ్నం భోజన సదుపాయం లేకపోవడంతో పాఠశాల అనంతరం విద్యార్థులంతా వసతి గృహానికి వచ్చి భోజనం చేసి తిరిగి పాఠశాలకు వెళ్లడం జరుగుతుంది. పూర్తిస్థాయిలో సంక్షేమ వసతి గృహం అధికారి లేకపోవడంతో గరుగుబిల్లి మండలం రావివలస సాంఘిక సంక్షేమ వసతి గృహం అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టు సుందరమైన భవనం ఉన్నప్పటికీ అందుకు విద్యార్థులు లేరు. అయినప్పటికీ ఇటీవల కాలంలో లక్షలాది రూపాయలు వెచ్చించి టైల్స్, పెయింటింగ్స్, నేమ్ బోర్డులు రాయించడం వంటివి జరిగాయి. వచ్చే విద్యా సంవత్సరానికి వసతి గృహంలో సంఖ్య పెరుగుతుందా? లేక మూసివేయబడుతుందా? అంటూ ప్రజల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి వసతి గృహంలో అధిక సంఖ్యలో పిల్లలను చేర్పించడంతో పాటు పూర్తిస్థాయిలో విధులు నిర్వహించే వసతిగృహ సంక్షేమ అధికారిని నియమించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి కొమరాడ

మండల ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నామని, దీన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో గిరిజనులు తాగునీటికి తీవ్ర ఇబందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే జల గ్రామంతో పాటు నయా పంచాయతీల్లో పలు గ్రామాలకు నేటికీ పూర్తి స్థాయిలో తాగునీరందని పరిస్థితి ఉందన్నారు. అలాగే వనకాబడి, గుమ్మడిగెడ్డ, తోటపల్లి, జంఝావతి వంటి నీటి వనరులను పూర్తిచేయాలని, గిరిజన గ్రామాల్లో చెక్‌డాంల నిర్మాణంపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. భూ సమస్యల పైన కూడా అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. నేటికి 10 వారాలుగా పెండింగ్ ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించలేదన్నారు. ఈ సమస్యలన్నింటిపైనా సోమవారం తలపెట్టిన ధర్నాలో మండల ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం నాయకులు లక్ష్మయ్య, కోటి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, పరీక్షా ఫలితల్లో సాధిస్తున్న విజయాలను గుర్తించి ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని జియమ్మవలస మండలం చినమేరంగి హైస్కూల్ ఉపాధ్యాయులు ఆదివారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. చినమేరంగి, అల్లువాడ, తుంబలి, దాసరిపేట, లింగలవలస గ్రామాల్లో ఆటో, కార్లతో విస్తృత ప్రచారం చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో మార్పులు చేసిందని, అన్ని రకాలు సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ముత్యాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

1100 మట్టి నమూనాలు సేకరణ

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో ఈ ఖరీఫ్ సీజన్లో 1100 మట్టి నమూనా సేకరణ లక్ష్యంగా మట్టిని సేకరిస్తున్నామని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని పాంచాలిలో రైతులు చల్ల వెంకట్రావు, యు.చిన్నారావు క్షేత్రాల్లో మట్టి నమూనాల సేకరణలో పాల్గొన్నారు. ప్రతి రైతు మట్టి నమూనాల సేకరణకు ముందుకు రావాలని, దగ్గరుండి తమ మట్టి నమూనాలను తీయించి గ్రామ వ్యవసాయ సహాయకునికి అందించాలని అన్నారు. మట్టి నమూనాల విశ్లేషణ ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకుంటే డబ్బు ఆదా కావడమే కాకుండా నేలలో పోషక సమతుల్యత ఏర్పడుతుందని అన్నారు. పోషక లభ్యత మధ్య పోటీ నివారించబడుతుందన్నారు. కావున రైతులు తప్పనిసరిగా తమ మట్టి నమూనాలను దగ్గరుండి తీయించుకోవాలని తెలిపారు.

ఎకరం మడిలో నాలుగు ఐదు చోట్ల ఈ ఆకారపు గుంత తవ్వి అంచుల వెంబడి మట్టి సేకరించాలని దీని అంతటినీ కలిపి ఆరబెట్టి మెత్తని 250 గ్రాముల మట్టిని విశ్లేషణ కొరకు మట్టి విశ్లేషణ కేంద్రాలకు పంపించాలని తెలిపారు. మట్టి నమూనా ఎలా సేకరించాలి, వీటివల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కావున రైతులంతా మట్టి నమూనాలను సేకరించి గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో విఎఎ ఈదుబిల్లి శ్రీను, సిఆర్‌పి తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

30న సింహాచలానికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 30న సింహాచలంలో శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామికి జరగబోయే చందనోత్సవాన్ని పురస్కరించుకొని, అప్పన్న స్వామి నిజరూప దర్శనానికి సింహాచలం వెళ్లే భక్తులకు పార్వతీపురం నుంచి బుధవారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఆర్‌టిసి డిపో మేనేజర్ దుర్గ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి ఉదయం 5.30లకు, 6.30, 7.30కు బయలుదేరుతాయన్నారు. యాత్రికుల రద్దీ మేరకు మధ్యాహ్నం కూడా బస్సులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కావున ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఇదేం 'చెత్త' పాలన : కాంగ్రెస్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



డంపింగ్‌యార్డు వద్ద చెత్తను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మున్సిపాలిటీలో ఇదేం "చెత్త" పరిపాలనని, డంపింగ్ యార్డ్ పక్కనే చెత్తలు, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయని, చెత్త శుద్ధి కేంద్రం ఏర్పాటు ఎప్పుడు చేస్తారని కాంగ్రెస్, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నాయకులు ప్రశ్నించారు. ఆదివారం ఆ పార్టీ నాయకులు వి.దాలి నాయుడు, సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, గేదెల రామకృష్ణ, కోలా కిరణ్ కుమార్, తీళ్ళ గౌరీ శంకరరావు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా కార్యదర్శి చుక్క చంద్రరావు తదితరులు ఆదివారం రాయగడ రోడ్డులో గల డంపింగ్ యార్డ్ వద్ద అంతర్ రాష్ట్ర రహదారిపై వేసిన చెత్త డంపింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపల్ పాలన గాడి తప్పిందని ఆరోపించారు. దీనికి ఉదాహరణగా అంతర్‌రాష్ట్ర రహదారిపై చెత్త డంపింగేనన్నారు. గతంలో వైసిపి పాలనలో వర్షాకాలంలో డంపింగ్ యార్డ్ లోకి వాహనాలు వెళ్లవంటూ అంతర్రాష్ట్ర రహదారిలో చెత్తను డంపు చేసే వారన్నారు. ఇప్పుడు కూటమి పాలనలో వైసిపికి ఏమీ తీసిపోమన్నట్లు వేసవిలోనే అంతర్రాష్ట్ర రహదారిపై చెత్తను డంపింగ్ చేస్తున్నారన్నారు. వైసిపి, కూటమి రెండింటి పాలన దొందు దొందేనని విమర్శించారు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలన్నారు. వేసవిలో చెత్త డంపింగ్ యార్డులో పొగ మంటలు ప్రారంభం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చెత్త డంపింగ్ యార్డ్ నిర్వహణతో పాటు మున్సిపాలిటీలో 24/7 పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలకు ఆరోగ్యాన్ని అందివ్వాలి అన్నారు. రాయగడ రోడ్డు లోని చెత్త డంపింగ్ యార్డ్ వల్ల, చెత్తను రోడ్డుపై డంప్ చేయడం వల్ల కొమరాడ మండలంతో పాటు ఒడిశా నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే సమీపంలోని జట్టు ఆశ్రమం, జగన్నాధపురం, వివేకానంద కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. డంపింగ్ యార్డ్‌లో పొగ మంటలు వచ్చే సమయంలో పలుమార్లు బాధితులు ఆందోళన చేపట్టే సందర్భాలను గుర్తు చేశారు. తక్షణమే అంతర్ రాష్ట్ర రహదారిపై డంపింగ్ చేసిన చెత్తను తొలగించాలని కోరారు. చెత్త డంపింగ్ యార్డ్ తరలింపు, నిర్వహణ, గోపసాగరంలో కబ్జాలు తొలగింపు పట్ల పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు.

స్కూటీపై గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్

ప్రజాశక్తి - కొమరాడ



గంజాయితో పోలీసులకు పట్టబడ్డ నిందితులు

ఒడిశా నుంచి ఆంధ్రాకు స్కూటీపై గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఆదివారం కూనేరు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా 850 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. ఒడిశా సరిహద్దు ప్రాంతం కెరడ గ్రామానికి చెందిన దీనబంధు రౌత్ , పార్వతీపురానికి చెందిన బర్ల కామేష్ గంజాయి రవాణా చేస్తూ పట్టుబడినట్లు తెలిపారు. వీరి వద్ద 850గ్రాముల గంజాయితో కెరడ వైపు నుంచి పార్వతీపురం వైపు స్కూటీ పై వస్తుండగా కూనేరు చెక్ పోస్ట్ వద్ద పట్టుకొని అరెస్టు చేసి గంజాయిని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో స్థానిక పోలీస్, చెక్ పోస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

నదిలో దిగి ఆవు మృతి

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రమైన మక్కువ సమీపాన గల సువర్ణముఖి నదిలోకి దిగిన ఆవు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక పైలెట్ ప్రాజెక్టు పంపు హౌస్ సమీపాన దొంగల రేవుగా పిలిచే ప్రాంతంలో ఎక్కువ నీరు నిల్వ ఉండడంతో నీటి అడుగు భాగంలో బురద కూడా ఉంది. తాగునీటికి దిగిన ఆవు మూడు రోజుల క్రితం మతి చెంది ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. నీటిలో ఆవు తేలియాడడంతో కొంతమంది వ్యక్తులు దాన్ని బయటకు తీశారు. అయితే ఆవు ఏ రైతుకు సంబంధించినది అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. ఇదిఇలా ఉండగా గతంలో కూడా ఈ ప్రాంతంలో పశువులు మృతి చెందినట్లు స్థానిక చెబుతున్నారు.